క్లుప్తంగా

పాఠశాలల సమస్యలపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంఈఓ ఈరన్న

హాలహర్వి: పాఠశాలల సమస్యలపై దృష్టి సారించాలని ఎంఈఓలు ఈరన్న, శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం స్థానిక హైస్కూల్‌లో పాఠశాల యాజమాన్య కమిటీ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పాఠశాలలు, విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే తెలుసుకుని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దుకాణంలో చోరీ



వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

పత్తికొండ(తుగ్గలి) : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలోని ప్లాస్టిక్, స్టీల్ దుకాణంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. దుకాణం పక్కనున్న చింత చెట్టు ద్వారా దొంగలు పైకి చేరుకుని పైకప్పు రేకు కట్ చేసి నగదు, వస్తువులు చోరీ చేశారు. సుమారు రూ.1.50లక్ష నగదు, రోల్డ్‌గోల్డ్, ఇతర వస్తువులు చోరీ చేసినట్లు యజమాని జమ్మన్న తెలిపారు. బాధితుడి సమాచారం మేరకు అర్బన్ సీఐ జయన్న, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు దుకాణాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. సీసీ ఫుటేజీలు పరిశీలించారు.

మంచి నాయకుడిని కోల్పోయాం



మృతదేహంపై పూలమాలలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కృష్ణగిరి: మండలంలో వైఎస్సార్‌సీపీ ఓ మంచి నాయకుడిని కోల్పోయిందని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. కృష్ణగిరికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు, మండల కో–ఆప్షన్ మెంబర్ షేక్ శాలిమియా (74) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ కేఈ సుభాషిణి, మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. డిష్ వెంకటేష్, జయరామిరెడ్డి, నారాయణ, హుసేన్‌సాహెబ్, చిన్న శాలిమియా, సుంకన్న, ప్రహ్లాద, జింకల రాముడు, సుబ్బారెడ్డి, సుంకన్న, బాలమద్ది తదితరులు ఉన్నారు.

నూతన సంవత్సర వేడుకలు



ఆర్డీఓకు శుభాకాంక్షలు తెలుపుతున్న పత్తికొండ తహసీల్దార్ రమేష్, సిబ్బంది

పత్తికొండ(తుగ్గలి) : స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం రెవెన్యూ అధికారులు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో భరత్ నాయక్ కేక్ కట్ చేశారు. డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, వీఆర్వోలు, సిబ్బంది ఆర్డీవోకు బొకేలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

హైందవ శంఖారావానికి తరలిరండి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈ నెల 5వ తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావానికి హిందువులందరూ తరలి రావాలని పాండురంగస్వామి ఆలయ నిర్వాహకులు ఎల్లప్ప స్వామి పిలుపునిచ్చారు. వెల్దుర్తిలో గురువారం ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం చేపట్టే కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి హిందువులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హరి నరసింహనాయుడు, శ్రీరాములు, వైద్యం రామానాయుడు, హరికృష్ణ పాల్గొన్నారు.

16 నుంచి ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో జరుగనున్న శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతరను పురస్కరించుకొని మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి స్మారకార్థం ఈనెల 16వ తేదీ నుంచి ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన (బండలాగుడు పోటీలు) నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలో ఆయా పోటీల పోస్టర్లను నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈపోటీలు ఈనెల 19వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, అదేవిధంగా పుట్‌బాల్, వాలీబాల్ తదితర క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఖజానా ఖాళీగా ఉందనే సాకుతో వివిధ వర్గాల ప్రజల పింఛన్లను తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం ఎత్తుగడ వేసింది. ఇందులో భాగంగా అధిక పింఛన్ పొందుతున్న దివ్యాంగుల పింఛన్‌దారులను తగ్గించాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. ఇందుకు ముందస్తుగా సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను నిలిపివేసింది. దివ్యాంగ పింఛన్ పొందేందుకు ఈ సర్టిఫికెట్ ప్రధానం. ఇప్పటికే అర్హత పొందిన దివ్యాంగులకు పింఛన్లు మంజూరు చేయలేదు. అలాగే కొత్తగా లబ్ధిదారుల గుర్తింపు నిలిపివేయడమే కాకుండా పింఛన్‌దారుల వైకల్య శాతాన్ని మరోసారి వెరిఫికేషన్ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. మండల స్థాయిలో తహసీల్దార్,ఎంపీడీఓ,వైద్యులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో కమిటీ వేసి అర్హతను నిర్ధారించనున్నారు.

దివ్యాంగులకు మొండిచేయి

- సదరం క్యాంపుల నిర్వహణ బంద్
- సర్టిఫికెట్ల జారీ నిలిపివేసిన కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో ప్రతి సోమవారం సీహెచ్‌సీల్లో వైకల్య ధ్రువీకరణ పరీక్షలు
- దివ్యాంగులకు తప్పని తిప్పలు
- జిల్లాలో 58,819 మంది దివ్యాంగ లబ్ధిదారులు
- వైఎస్సార్‌సీపీ హయాంలో 30 వేల మందికి సదరం సర్టిఫికెట్ల జారీ



ఆలూరు సీహెచ్‌సీలో వికలాంగుడికి పరీక్షలు చేస్తున్న ఆర్థోపెడిక్ డాక్టర్ సుబ్బరాయుడు (ఫైల్)

ఆలూరు రూరల్: సీహెచ్‌సీల్లో దివ్యాంగుల పరీక్షల సదరం క్యాంపు, సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను ప్రభుత్వం ఈ నెల నుంచి నిలిపి వేసింది. గత ఏడాది డిసెంబర్ 24 నుంచి సచివాలయాల్లో స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి వెయిటింగ్ లిస్టు చూపుతోంది. ఇప్పటికే అంగవైకల్యం సర్టిఫికెట్ పొంది పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారులు, 90 శాతానికి పైగా వైకల్యం ఉండి నెలనెలా రూ.10 వేల నుంచి రూ. 15 వేల పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారుల వెరిఫికేషన్ ప్రక్రియ మొదలు పెట్టనుందని సమాచారం. వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామ/వార్డు సచివాలయాల్లో ముందుగా సదరం స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగులకు జిల్లాలోని ఆదోని, ఆలూరు, కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, కోసిగి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ప్రతి సోమవారం ఆర్థోపెడిక్ డాక్టర్లు అంగవైకల్య పరీక్షలు చేసి సర్టిఫికెట్లు జారీ చేసేవారు. సదరం క్యాంపుల నిర్వహణను కూటమి ప్రభుత్వం నిలిపివేయడంతో దివ్యాంగులకు అవస్థలు తప్పేలా లేవు.

గతంలో ప్రతి సోమవారం వైకల్య పరీక్షలు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి సీహెచ్‌సీలో దివ్యాంగులకు అంగవైకల్య పరీక్షలు చేసే వెసులుబాటు కల్పించింది. 2019 వరకు టీడీపీ ప్రభుత్వం హయాంలో అంగవైల్యం, మానసిక, పక్షవాతం సోకిన వికలాంగులు అంగవైకల్యం సర్టిఫికెట్ పొందాలంటే నెలలు తరబడి వేచి చూడాల్సి ఉండేది. 6 నెలలకొకసారి సదరం క్యాంపులు ఏర్పాటు చేసేవారు. వికలాంగులు జిల్లా కేంద్రానికి వెళ్లి నానా అవస్థలు పడేవారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత వైకల్యం పొందిన వారు సచివాలయాల్లో స్లాట్ బుక్ చేసుకుంటే ప్రతి సోమవారం నియోజకవర్గ కేంద్రాల్లోని సీహెచ్‌సీలో వైద్యులు పరీక్షలు చేసి సర్టిఫికెట్లు జారీ చేసేలా చర్యలు చేపట్టారు. దీంతో వికలాంగులు అంగవైకల్యం సర్టిఫికెట్ పొంది వికలాంగుల పింఛన్‌కు అర్హత పొందేవారు.

ప్రశ్నార్థకంగా సర్టిఫికెట్ల జారీ..

ప్రమాదవశాత్తు అంగవైకల్యం పొందిన వారు గత వైఎస్సార్ సీపీ హయాంలో నెలలోపు సచివాలయంలో దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్ పొందేవారు. వలంటీర్ల ద్వారా సచివాలయంలో వికలాంగుల పింఛన్‌కు అర్హత పొంది ప్రతి నెల పింఛన్ తీసుకునే వారు. వైకల్యం పొందిన దివ్యాంగులకు ఈ సొమ్ము ఆర్థికంగా ఎంతో ఉపయోగపడేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సర్టిఫికెట్ల జారీ నిలిపివేయడంతో అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు సర్టిఫికెట్లు అందడం ప్రశ్నార్థకంగా మారింది.

నెలలో పింఛన్ ఇచ్చారు



నాకు పుట్టుకతో వైకల్యం ఉంది. సదరం సర్టిఫికెట్ ఎలా పొందాలో తెలియక దరఖాస్తు చేసుకోలేదు. మూడేళ్ల క్రితం సచివాలయంలో దరఖాస్తు చేసుకోగా..వైద్యులు పరీక్షలు చేసి వైకల్య సర్టిఫికెట్ అందించారు. నెలలోపు వికలాంగుల పింఛన్‌కు అర్హురాలిగా గుర్తించారు. నాటి నుంచి ప్రతినెలా పింఛన్ అందుకుంటున్నా.

– నాగమ్మ, దివ్యాంగురాలు, మొలగవల్లి

పింఛన్ల ఏరివేతకు కూటమి కుట్ర



వికలాంగుల పింఛన్ల ఏరివేతకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నింది. దివ్యాంగులకు పింఛన్ అందించలేకనే సదరం క్యాంపులను నిలిపివేసింది. వికలాంగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సదరం సర్టిఫికెట్ పొందడాన్ని సులభతరం చేసింది. జిల్లాలో మొత్తం 58,819 మంది దివ్యాంగ పింఛన్ అర్హత పొందిన వారు ఉన్నారు. వీరిలో ప్రస్తుతం 38,661 ప్రతి నెలా పింఛన్ అందుకుంటున్నారు. గత ఐదేళ్ల కాలంలో 30 వేల మంది దివ్యాంగులు సదరం క్యాంపుల్లో సర్టిఫికెట్ పొంది పింఛన్‌కు అర్హత సాధించారు.ఇంకా 20,158 మంది పింఛన్ పొందాల్సి ఉంది. 2019 వరకు టీడీపీ హయాంలో కేవలం 8 వేల మంది దివ్యాంగులు మాత్రమే నెలనెలా పింఛన్ అందుకునే వారు. వికలాంగత్వ శాతం తక్కువ ఉందని పింఛన్లు నిలిపివేయాలి చూస్తున్నారు. తహసీల్దార్,ఎంపీడీఓ,వైద్యులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లుతో మండల కమిటీ వేసి పింఛన్లను వెరిఫికేషన్ చేయనున్నారని తెలిసింది. వెరిఫికేషన్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి.

– రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి



పత్తికొండలో శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్ నాగభూషణం

పత్తికొండ(తుగ్గలి) : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలని ఎంఈవో–2 రమేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రీసోర్స్‌పర్సన్లు జయరాముడు, నాగభూషణం, నాగేశ్వరరావు పాఠశాల యాజమాన్య కమిటీల విధులు, బాధ్యతలు, బాలల హక్కుల పరిరక్షణ, సమావేశాల నిర్వహణ, అభివృద్ధి ప్రణాళిక, పాఠశాలల సామాజిక తనిఖీ, ప్రజల భాగస్వామ్యం, సమస్యల పరిష్కారంపై చైర్మన్లకు అవగాహన కల్పించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజల భాగస్వామ్యంతో పాఠశాలల అభివృద్ధికి పాటు పడాలని ఎంఈవో సూచించారు.

కృష్ణగిరి: ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ–2 మద్దయ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన ఎస్‌ఎంసీ సభ్యులు, హెచ్‌ఎంలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలను గుర్తించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మంచి పౌష్టికాహారం అందించడంలో ముఖ్యపాత్ర వహించాలన్నారు. ట్రైనర్లు సునిల్‌బాబు, జానకిరాముడు, రంగరత్నం, ఎంఎంఎస్ కో–ఆర్డినేటర్ రాజేష్, సీఆర్పీలు కృష్ణమూర్తి, వీరనాగప్ప, శ్యామల, హెచ్‌ఎంలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని 44 గ్రామాలకు సంబంధించిన ఎస్‌ఎంసీ సమావేశం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ఎంఈఓ–1 తిమ్మారెడ్డి, ఎంఈఓ–2 నిర్మలాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు.విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములను చేయడం, పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రుల సాయం కోరడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

సూపర్ సిక్స్ పథకాలు.. సూపర్ మోసాలు



తెర్నేకల్ సురేందర్‌రెడ్డిని సన్మానించిన కార్యకర్తలు

దేవనకొండ: సీఎం చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాల పేరుతో సూపర్ మోసాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్‌రెడ్డి విమర్శించారు. గురువారం తెర్నేకల్ గ్రామంలో ఆయన కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తల్లికి వందనం అని చెప్పి నేటికీ ఆ ప్రస్తావనే తేవడం లేదని, ప్రతి రైతుకు ఏటా అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు ఇస్తానని చెప్పి..రైతు నడ్డి విడిచారన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తానని చెప్పి కరెంట్ బిల్లులు పెంచి వారి నుంచి ఆ మొత్తాన్ని లాక్కుంటున్నాడన్నారు. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము ఇవ్వక వారు రోడ్డెక్కాల్సిన దుస్థితి కల్పించారని మండిపడ్డారు. స్కూల్ విద్యను అభివృద్ధి పథంలో నడిపిస్తానని చెప్పి స్కూళ్లల్లో టీచర్లు లేకుండా చేస్తున్నారన్నారు. ప్రజలు ఇప్పటికైనా మంచి చేసే నాయకుడు ఎవరో, ప్రజలను మోసం చేసే నాయకుడు ఎవరో గ్రహించాలని కోరారు.

డైరీ ఆవిష్కరణ



పత్తికొండలో డైరీ ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

పత్తికొండ(తుగ్గలి) : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్)–2025 డైరీని గురువారం స్థానిక సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి, సీనియర్ న్యాయవాదులు ఎల్లారెడ్డి, మైరాముడు, సత్యనారాయణ, పంపావతి, నాగభూషణరెడ్డి, నాగేష్, నారాయణస్వామి, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకృష్ణ, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆస్పరి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్టీయూ నూతన క్యాలెండర్‌ను ఏంఈఓ–2 తిరుమలరావు విడుదల చేశారు. అనంతరం ఏంఈఓను ఎస్టీయూ నాయకులు శాలువ, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర, కాశీ విశ్వనాథ శాస్త్రి, జ్యోతిమూర్తి, లక్ష్మీపతి, రామాంజిని, మురళీకృష్ణ, బసవరాజు, నాగరాజు పాల్గొన్నారు.

దేవనకొండ: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) నూతన క్యాలెండర్‌ను గురువారం తెర్నేకల్ గ్రామ సర్పంచ్ మొగతాల్ అరుణ్‌కుమార్, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జి.రోషన్న విడుదల చేశారు. పంచాయతీ కార్యదర్శి తలారి రాముడు, నాయకులు చిన్నవెంకప్ప, తిమ్మప్ప, రాము, పరమేష్ పాల్గొన్నారు.

ఈ–కేవైసీ తప్పనిసరి

హొళగుంద: స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులు సచివాలయాలో ఈ–కేవైసీ చేయించుకోవాలని సొసైటీ కార్యదర్శి నీలకంఠస్వామి గురువారం తెలిపారు. ప్రస్తుతం సొసైటీలో సభ్యత్వం ఉన్న రైతులు తమ గ్రామ పరిధిలోని సచివాలయాలకు వెళ్లి ఈ– కేవైసీ చేయించుకోవాలని చెప్పారు. సభ్యత్వం ఉన్న వారికి ఈ–కేవైసీ తప్పనిసరన్నారు.

• మురుగు మధ్య జీవనం



ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీరు



కుంట వద్ద ఆడుకుంటున్న చిన్నారులు

మద్దికెర : మండల కేంద్రంలోని మాల వీధిలో తంబాలకుంట వాసులు మురుగు మధ్య జీవనం సాగిస్తున్నారు. కాలనీలో ఇళ్ల మధ్య మురుగునీరు నిలిచిపోయింది. దుర్గంధం వెదజలుతున్నా తప్పని పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నామని స్థానికులు వాపోతున్నారు. నీటి కుంటను శుభ్రం చేసి పూడ్చాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు పాఠశాలకు వెళ్లేటప్పుడు, సెలవుల సమయంలో ఆడుకుంటూ కుంటలో పడిపోతారేమోనని భయాందోళన చెందుతున్నారు.

8 నుంచి ఆరాధనోత్సవాలు

పత్తికొండ(తుగ్గలి) : హోసూరు సమీపంలోని తోటలో వెలసిన శ్రీ మహాత్మా యోగి నరసింహస్వామి 82వ ఆరాధన మహోత్సవాలు ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ధర్మకర్త సురేంద్రనాథ్ రెడ్డి గురువారం తెలిపారు. 8న స్వామికి పంచామృతాభిషేకం, రథాంగ హోమం, రథోత్సవ కలశస్థాపన, భజనలు, 9న మధ్యాహ్నం 12గంటలకు స్వామి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నేడు ఆలూరులో జాబ్‌మేళా

ఆలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈనెల 3వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లా వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనందరాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ ఇన్సూరెన్స్, బీఎంఎస్ సెక్యూరిటీస్ కంపెనీలకు చెందిన అధికారులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. విద్యార్హతలు ఉన్న నిరుద్యోగులు ఒరిజనల్ సర్టిఫికెట్లు, లేటెస్ట్ నాలుగు పాస్ ఫొటోలు, రెండు జతల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు.

ఘనంగా గంధోత్సవం

తుగ్గలి : మస్తానయ్యస్వామి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి జీ.ఎర్రగుడిలో గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గంధాన్ని ఊరేగించి దర్గాకు చేర్చారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం ఉరుసు ఉంటుందని ముజావర్లు తెలిపారు.

ఎల్లార్తి దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు

హొళగుంద: మండలంలోని ఎల్లార్తి గ్రామంలో వెలిసిన షేక్షావలి, షాషావలి దర్గాల్లో గురువారం ప్రత్యేక ఫాతెహాలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గాలను దర్శించుకుని ప్రత్యేక ఫాతెహాల్లో పాల్గొన్నారు. అలాగే కొందరు భక్తులు రాత్రి దర్గాలో నిద్రించి ఉదయం చాదర్‌లు, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగి తాతా దర్గాలతో పాటు షిర్డిసాయి బాబా ఆలయాలను భక్తులు సందర్శించి పూజలు చేశారు.

సబ్‌సెంటర్ మార్చండి

ఆలూరు రూరల్: మండలంలోని హత్తిబెళగల్ గ్రామంలో ఉన్న హెల్త్ సబ్ సెంటర్‌ను పాత పంచాయతీ భవనంలోకి మార్చాలని గ్రామస్తులు గురువారం పంచాయతీ కార్యదర్శి జిలాన్‌కు వినతి పత్రం అందించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న సబ్ సెంటర్ గ్రామం చివర వానపాముల తయారీ కేంద్రంలో ఉండటంతో రోగులకు ఇబ్బంది మారిందన్నారు. స్థానిక పాత గ్రామ పంచాయతీ భవనంలో తాత్కాలికంగా ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని వారు కోరారు.

ప్రయాణికుల సమస్యకు పరిష్కారం

వెల్దుర్తి(కృష్ణగిరి) వెల్దుర్తి పట్టణంలో స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో ఆర్టీసీ బస్సులను ఆపాలని ప్రమాణికులు స్థానిక పోలీసులకు విన్నవించారు. ఈ విషయంపై స్థానిక జి.అశోక్ డోన్ ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ప్రయాణికుల సమస్యకు పరిష్కారం చూపారు. కొన్ని రోజులుగా ఇక్కడ బస్సులు ఆపకపోవడంతో వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. గురువారం నుంచి బస్సులు పోలీస్‌స్టేషన్ సమీపంలో రిక్వెస్ట్ బస్టాప్ వద్ద నిలుపుతుండంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డును కొలతలు వేస్తున్న దృశ్యం

కృష్ణగిరి: మండలంలోని పోతుగల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని జి.మల్లాపురం గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీల్లో పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన గ్రావేల్ రోడ్లను గురువారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ తెలుగు వాణీశ్రీ పరిశీలించారు. దాదాపు లక్షన్నర రూపాయలతో గ్రావెల్ రోడ్డు వేస్తున్నామని చెప్పారు.

అధికారులే రాకపోతే గ్రామసభ ఎందుకు?



అధికారుల గైర్హాజరుపై పంచాయతీ సెక్రటరీని ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

హొళగుంద: ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే అధికారులకు చెప్పుకుంటారు. గ్రామ సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కోసం నిర్వహించే గ్రామసభకు అధికారులే రాకపోతే ఇక ఎందుకు సభలు ఏర్పాటు చేస్తారని బీజేపీ నాయకుడు సభ్యుడు చిదానంద, మాజీ మండలాధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ పంచాయతీ సెక్రటరి రాజశేఖర్‌ను ప్రశ్నించారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చలవాది రంగమ్మ అధ్యక్షతన పంచాయతీ సెక్రటరి రాజశేఖర్ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. సెక్రటరీ మాట్లాడుతుండగా ఆయా శాఖల అధికారుల గైరాజరుపై పలువురు ప్రశ్నించారు. గ్రామంలో సమస్యలను తెలుసుకునేందుకు సభకు రాకపోవడమేమిటి? వారొస్తేనే సభ జరపాలని, లేదంటే సభను నిర్వహించొద్దని తేల్చి చెప్పారు. సదరు అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అంతకు ముందు సెక్రటరి మాట్లాడుతూ గ్రామంలో 940 అక్రమ కుళాయిలు ఉన్నాయని రూ.2 వేలు డిపాజిట్ చెల్లించి సక్రమం చేసుకోవాలని సూచించారు.

ఎల్లార్తిలో...

ఎల్లార్తి సచివాలయంలో సర్పంచ్ కురువ చాముండేశ్వరి ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీ మహమ్మద్ షఫి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి తదితరులు మాట్లాడుతూ గ్రామంలో మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



ముద్దటమాగిలో మాట్లాడుతున్న తహసీల్దారు సతీష్

కృష్ణగిరి: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని టి. గోకులపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి 10 అర్జీలను స్వీకరించారు. వీఆర్వో వెంకటేశ్వర్లు, సర్వేయర్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని శంకరబండ గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామ రైతులు భూ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్‌కు దరఖాస్తులు ఇచ్చారు. కార్యక్రమంలో డీటీ భీమేష్, ఆర్ఐ రంగస్వామి, వీఆర్‌ఓ మాబుసుభానీ పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: మండలంలోని అంగస్కల్ గ్రామంలో గురువారం డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అడంగల్‌లో మార్పులు,చేర్పులు, మిగులు భూమి, పాసుపుస్తకం కోసం 4 అర్జీలు వచ్చినట్లు వెల్లడించారు. మండల సర్వేయర్ అరుణ జ్యోతి, వీఆర్వోలు మహీంద్రా,ఆనంద్ ఉన్నారు.

హొళగుంద: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నటు తహసీల్దారు సతీష్ అన్నారు. గురువారం ముద్దటమాగి గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది.భూ విస్తీర్ణం, మిగులుభూములు, ఆన్‌లైన్ అడంగల్‌లో చేర్పులు మార్పులు, పట్టాదారు పాసుబుక్కులు తదితర వాటిని పరిష్కరించాలని రైతుల నుంచి 13 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు తెలిపారు. వీఆర్‌ఓ సూరంజనేయులు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ చేరిన ఆలయ నిర్వహణ వివాదం



పోలీసు స్టేషన్‌కు వచ్చిన మొలగవల్లి గ్రామస్తులు

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి గ్రామంలో ఉన్న మాణిక్య ప్రభు స్వామి పీఠం నిర్వహణ పంచాయితీ గురువారం పోలీసు స్టేషన్‌కు చేరింది. వివరాలు.. గ్రామంలోని మాణిక్య ప్రభు ఆలయ నిర్వాహణ పూర్వం నుంచి ఏడాదికి ఒకరు చొప్పున దాయాదులైన రాఘవేంద్ర స్వామి, మురళి స్వామి కుమారులు చూసుకునే వారు. ఈ ఏడాది మురళి స్వామి కుమారుల వంతు ఉండగా రాఘవేంద్ర స్వామి ఆలయం నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పలేదు. దీంతో మురళి స్వామి కుమారుడు రవి స్వామి, కొందరు భక్తులు, రాఘవేంద్ర స్వామి శిష్యుల మధ్య వివాదం తలెత్తింది. గురువారం ఆలయ నిర్వాహకులతో పాటు గ్రామస్తులు,భక్తులు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. పోలీసులు ఇద్దరు దాయాదులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. వంతుల వారీగా నిర్వహించుకోవాలని పోలీసులు సూచించారు. గ్రామంలో వివాదాలు సృష్టిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించి పంపించారు.



మద్దికెరలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి

గ్రామాభివృద్ధికి సహకారం

మద్దికెర: పార్టీలకతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు తమ వంతు కృషి చేస్తామని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే కేయి శ్యాంకుమార్, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం స్థానిక జగనన్న కాలనీ దగ్గర రూ.65 లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకును ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ప్రధాన బజారులో నాబార్డు నిధులు రూ.15 లక్షలు, దాతల సహకారం రూ.3 లక్షలు, పంచాయతీ రూ.3 లక్షలు మొత్తం రూ.21 లక్షలతో నిర్మించిన కూరగాయల మార్కెట్ సముదాయాన్ని ప్రారంభించారు. సర్పంచ్ బండారు సుహాసిని అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలోనే అత్యంత వేగంగా మార్కెట్‌ను నిర్మించడం హర్షనీయమన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

మండల కేంద్రంలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల చేయాలని ఆపద్బంధు సేవాసమితి సభ్యులు వారికి వినతిపత్రం అందజేశారు. ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేయాలని కోరారు. జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, మాజీ సర్పంచ్, దాత కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి, కాంట్రాక్టర్ తాలూరి వెంకటేశ్వరరెడ్డి, డీఈ ఖాన్, ఏఈ మయాంక్, ఎంపీటీసీ ఆంజనేయులు పాల్గొన్నారు.